మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలి

భీమారం : మొక్కల సంరక్షణకు దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ ఆదేశించారు. మండలంలోని పోలంపల్లి పంచాయతీలో గల జీపీ నర్సరీని ఎంపీఓ సతీష్‌రెడ్డితో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలో పెంచుతున్న మొక్కల ఎదుగుదలను పరిశీలించారు. అనంతరం వనసేవక్ సిబ్బందితో మాట్లాడుతూ వేసవి కాలం ఆరంభం కావడంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ప్రతి మొక్క తడిచే విధంగా నీరందించాలన్నారు. అందుకోసం అవసరమయ్యే వాటర్ క్యూరింగ్ ట్యూబ్ వంటి పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని, అదేవిధంగా ట్యాంకులలో ఎప్పటికప్పుడు నీటి నిల్వలను చూసుకోవాలని పేర్కొన్నారు.



అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
బుధవారం 01 ఫిబ్రవరి 2023

ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలి

నిర్మల్ : ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కె.జానిరెడ్డి అన్నారు. నిర్మల్ డిపోను మంగళవారం తనిఖీ చేశారు. బస్సుల నిర్వహణ, ఆదాయం, ప్రయాణికుల రద్దీ ఉండే రూట్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రయివేట్ బస్సుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. యజమానులు ఆర్టీసీ అధికారులతో కలిసి పని చేసుకోవాలని సూచించారు. చెయ్యి ఎత్తిన చోట బస్సు ఆపాలని, ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్.సాయన్న, సహాయ మేనేజర్లు ఐ. రాజశేఖర్, శ్రీకర్, ప్రయివేట్ బస్సుల యజమానులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టీల్ గ్లాసులు అందజేత



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాల విద్యార్థులకు రాగిజావ పంపిణీకి కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన వ్యాపారస్తుడు గణపురం ప్రకాష్, మురళీ, కమల కిశోర్ బంగ్, తూడూరి విజయ్‌కుమార్, తాటి రాంచందర్, గడ్డం శ్రీనివాస్, రాచకొండ గిరీష్ కలిసి స్టీల్ గ్లాసులు అందజేశారు. మండల వ్యాప్త పాఠశాలల్లో వెయ్యి స్టీల్ గ్లాసులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సముద్రాల సరిత, సర్పంచ్ గణపురం కావ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భానుప్రకాష్, సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ఇన్‌చార్జి మల్లేశం, కమిటీ సభ్యులు నరసింహాచారి, రాచర్ల వెంకన్న, శ్రీనివాస్, నగేష్, కృష్ణమూర్తి, రాజన్న, ట్రస్టు సభ్యులు లక్ష్మణ్, నగేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సఖీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-దహెగాం

సఖీ కేంద్రం సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సఖీ కేస్ వర్కర్ శ్రీనిధి అన్నారు. మంగళవారం మండలంలోని మొట్లగూడ, రాంపూర్, దిగిడ, ఖర్జీ, గిరవెల్లి, గెర్రె గ్రామాల్లో సఖీ కేంద్రం సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సఖీ కేంద్రంలో వైద్యసేవలు, కౌన్సెలింగ్, పోలీస్ సహాయం, న్యాయ సహాయం, తాత్కాలిక వసతి లాంటి ఐదు రకాల సేవలను అందించడం జరుగుతుందన్నారు. మహిళలు హెల్ప్‌లైన్ కోసం 181 నెంబర్‌తో పాటు 8500240181 లేదా 8500785181 నెంబర్లను ఉపయోగించుకోవాలని సూచించారు. మహిళలకు ఎలాంటి సమస్యలున్నా సఖీ కేంద్రానికి నేరుగా రావొచ్చని పేర్కొన్నారు. యువతులకు 18 ఏండ్లు నిండకముందే బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక సమస్యలను ఎదుర్కోవడంతో పాటు చట్టపరంగా శిక్షలు భరించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పారా మెడికల్ సిబ్బంది సత్యశీల, మల్టీపర్పస్ రఘు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

భవనం మంజూరు చేయాలని వినతి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కిర్డీ గ్రామంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించాలని కోరుతూ సీడీపీఓ రెబికకు వినతిపత్రం అందజేశారు. రెండేండ్ల క్రితం భవనం కూల్చివేయడంతో అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోందన్నారు. పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు ఇబ్బందుల దృష్ట్యా కొత్త భవనం నిర్మించాలని కోరారు. మండలంలోని భీంగూడ, లింబుగూడ గ్రామాల్లోనూ అంగన్‌వాడీ భవనాలను మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పెందూర్ రాజేష్, ఆదివాసీ భారత్ మహాసభ జిల్లా అధ్యక్షుడు, దుర్గం దినకర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మన ఊరు మన బడి పాఠశాల ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మంగళవారం పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పట్టణంలోని విద్యానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన అనంతరం తిరిగి వెళ్లేందుకు కారు ఎక్కగా అక్కడ ఉన్న చాత్రోపాధ్యాయులు కలెక్టర్‌తో ఫొటో దిగుతామని కోరారు. దీనికి కలెక్టర్ సైతం ఒప్పుకొని కారు దిగి వారితో మాట్లాడగా మురిసిపోయారు. ఈ మేరకు కలెక్టర్‌తో సెల్ఫీ దిగి ఆనందపడ్డారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు, 39 మందికి జరిమానా

నవతెలంగాణ-నిర్మల్

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష, 39 మందికి జరిమానా విధిస్తూ మంగళవారం జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చినట్టు ట్రాఫిక్ ఎస్ఐ దేవేందర్ తెలిపారు. ఆదిలాబాద్‌కు చెందిన సీహెచ్.ప్రసాద్, ముధోల్ మండలం ఎడ్‌బిడ్‌కు చెందిన జె.ప్రకాష్‌కు 3రోజుల సాధారణ జైలు శిక్ష, మరో 39మందికి మొత్తం రూ.53,300 జరిమానా విధించినట్లు వెల్లడించారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

నిర్మల్ పట్టణ మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా బీజేపీ అధ్వర్యంలో తలపెట్టిన మహా ధర్నాకు వెళ్లకుండా స్థానిక బీజేపీ నాయకులను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు గుడ్ల రంజిత్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రాంపల్లి గంగాధర్ ఉన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు సిద్ధమైన తమను అరెస్టు చేయడం తగదని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.

మన బడి..నూతన ఒరవడి..!

- సర్కారు పాఠశాలల్లో అందుబాటులోకి సకల సౌకర్యాలు
- ఉమ్మడి జిల్లాలో పూర్తికావచ్చిన తొలిదశ పాఠశాలలు
- నేడు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో ప్రారంభం

సర్కారు బడులకు కొత్త కళ వచ్చింది. వివిధ సౌకర్యాలతో అందంగా రూపుదిద్దుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు-మనబడి..మన బస్తీ కింద చేపట్టిన సర్కారు పాఠశాలలు నూతన ఒరవడిని సంతరించుకున్నాయి. తొలిదశలో చేపట్టిన బడుల్లో సకల సౌకర్యాలు సమకూరాయి. ప్రయివేటు, కార్పొరేట్ స్థాయిలో కొత్త శోభను తలపిస్తున్నాయి. గతం కంటే ఆధునాతన సౌకర్యాలు సమకూరడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తరగతి గదులు, కిచెన్‌షెడ్లు, బాలబాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు తదితర వసతులు అందుబాటులోకి రావడంతో విద్యార్థులు ఏండ్లుగా పడుతున్న బాధలు దూరం కానున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ కార్యక్రమంలో భాగంగా తొలిదశలో చేపట్టిన పనులు దాదాపు పూర్తికావచ్చాయి. తాజాగా మండలానికి రెండు చొప్పున మోడల్‌గా తీసుకొని త్వరితగతిన చేపట్టిన వాటిలో వందశాతం పనులు పూర్తికావడంతో బుధవారం వీటిని లాంఛనంగా ప్రారంభించేందుకు అధికారులు నిర్ణయించారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సౌకర్యాలలేమితో కూనరిల్లుతున్న సర్కారు బడులను బాగు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం మన ఊరు-మన బడి, మన బస్తీ కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగా రానున్న ఏడాదికి 35శాతం పాఠశాలల చొప్పున రానున్న మూడేండ్లలో వందశాతం పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలని భావించింది. 12 అంశాల్లో పాఠశాలలను ఆధునీకరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆధునాతన తరగతి గదులు, మైనర్, మేజర్ రిపేర్లు, విద్యుద్దీకరణ, తాగునీరు, డైనింగ్‌హాల్ నిర్మాణాలకు నేరుగా విద్యాశాఖ నుంచి నిధులు కేటాయించింది. ఫర్నీచర్, డ్యూయల్ డెస్కులు, గ్రీన్ చాక్‌బోర్డు, భవనాలకు రంగులు వేయడానికి నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే టెండర్లు పిలిచి పనులు అప్పగించింది. మరోపక్క కాంపౌండ్‌వాల్‌లు, టాయిలెట్లు, కిచెన్‌షెడ్ల నిర్మాణాలకు మాత్రం ఉపాధి నిధులను వెచ్చించింది. ప్రభుత్వం టెండర్లు అప్పగించిన పనులు శరవేగంగా సాగుతున్నా ఉపాధి నిధులతో చేపట్టే పనుల్లో మాత్రం కొంత జాప్యం జరుగుతోంది. తాజాగా ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో తొలిదశలో 35శాతం బడులను బాగు చేస్తుండగా.. ఇందులోనూ త్వరగా పూర్తిచేసేందుకు మండలానికి రెండు చొప్పున మోడల్ స్కూల్‌లుగా తీర్చిదిద్దాలని భావించి వాటిని పూర్తిచేశారు. ప్రస్తుతం ఆయా జిల్లాలో 35 పాఠశాలల చొప్పున పనులు పూర్తికావడంతో వాటిని ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

బడులకు కొత్త రూపు..!

సర్కారు బడులనగానే సౌకర్యాలు ఉండవనే అపనమ్మకం ఉంది. వాటిని పారద్రోలాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వీటిని బాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. తరగతి గదులు సక్రమంగా లేకపోవడం..భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం, టాయిలెట్స్ లేకపోవడం వంటి సమస్యల కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు ఉండవనే కారణంగా విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోయింది. అనేక మంది తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రయివేటు బాట పట్టించారు. కరోనా సంక్షోభం తర్వాత ఆర్థిక స్థితిగతుల దృష్ట్యా తల్లిదండ్రులు మళ్లీ వారి పిల్లలను సర్కారు బడులకు పంపిస్తున్నారు. దీంతో గతం కంటే ప్రభుత్వ పాఠశాలల్లో సంఖ్య పెరిగింది. దీంతో ప్రభుత్వం సైతం వీటిని బాగు చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా రూ.700కోట్లతో బడులను బాగుచేసేందుకు సిద్ధమైంది. తాజాగా తొలిదశలో చేపట్టిన పనులు పూర్తికావడంతో వాటిని అధికారికంగా ప్రారంభించనున్నారు. దీంతో సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థులకు ఆధునాతన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. మిగతా పాఠశాలల్లోనూ పనులు త్వరగా పూర్తయితే మరింత మంది విద్యార్థులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది.

గతం కంటే చాలా మెరుగయ్యాయి : దుర్గం మల్లేష్, ప్రధానోపాధ్యాయుడు, విద్యానగర్ ప్రాథమిక పాఠశాల



ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించడంతో గతం కంటే చాలా సౌకర్యాలు మెరుగయ్యాయి. ఇది వరకు వివిధ సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. తాజాగా ఉపాధ్యాయుల స్టాఫ్‌తో పాటు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం చాలా సంతోషకరం.

అన్ని సౌకర్యాలు సమకూరాయి : టి.ప్రణీత, జిల్లా విద్యాశాఖాధికారి, ఆదిలాబాద్



మన ఊరు-మన బడి, మన బస్తీ కింద వివిధ పాఠశాలల్లో చేపడుతున్న పనులన్నీ దాదాపు పూర్తయ్యాయి. మోడల్ స్కూళ్ల కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో వందశాతం సౌకర్యాలు సమకూరడంతో వాటిని ప్రారంభిస్తున్నాం. మిగతా వాటి పనులు కూడా త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లాలకు కొత్త సారథులు..!

- ఆదిలాబాద్ కలెక్టర్‌గా రాహుల్‌రాజ్
- కుమురంభీం జిల్లాకు షేక్ యాస్మీన్‌భాషా
- నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి
- మంచిర్యాల కలెక్టర్‌గా బదావత్ సంతోష్





నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాకు కొత్త కలెక్టర్లు వచ్చారు. ఇక్కడ సుమారు మూడేండ్లుగా పనిచేస్తున్న పాలనాధికారులను వివిధ జిల్లాలకు కేటాయిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా కుమురంభీం జిల్లాలో పనిచేసిన రాహుల్‌రాజ్‌ను నియమించింది. ఇక్కడ 2020 జులై 17 నుంచి సుమారు రెండేండ్లకు పైగా కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన కలెక్టర్ సిక్తాపట్నాయక్ హన్మకొండకు బదిలీ అయ్యారు. కుమురంభీం జిల్లా నూతన కలెక్టర్‌గా షేక్ యాస్మీన్ భాషా నియామకమయ్యారు. ఇక్కడ 2020 నవంబర్ 8వ తేదీ నుంచి రెండేండ్లకు పైగా కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన రాహుల్‌రాజ్‌ను ప్రభుత్వం ఆదిలాబాద్‌కు కేటాయించింది. నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా ఉట్నూర్ ఐటీడీఏ పీఓగా సుమారు ఏడు నెలలుగా పనిచేసిన కర్నాటి వరుణ్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ జిల్లాలో 2020 ఫిబ్రవరి 2వ తేదీ నుంచి మూడేండ్ల పాటు విధులు నిర్వర్తించిన ముషారఫ్ అలీ ఫారూఖీని ప్రభుత్వం బదిలీ చేసింది. మంచిర్యాల జిల్లా నూతన కలెక్టర్‌గా బదావత్ సంతోష్ నియమితులయ్యారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా పని చేస్తున్న ఈయనను కలెక్టర్‌గా నియమించింది. ఇక్కడ 2018 సెప్టెంబర్ 3 నుండి పనిచేస్తున్న భారతిహోళికేరీని ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమించింది. ఇది వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కలెక్టర్లుగా పనిచేసిన నలుగురు వేర్వేరు జిల్లాలకు కేటాయించబడ్డారు. ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలోనే పనిచేయనున్నారు.





9,10 తేదీల్లో మహాధర్నాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ - సిర్పూర్(టి)

రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీలో వీఓఏలుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామని సీఐటీయూ జిల్లా నాయకులు కృష్ణమాచారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వీఓఏలకు సెర్ప్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇస్తామని చెప్పిందన్నారు. ప్రతిరోజు ఆన్‌లైన్‌లో పనుల పేరుతో పనిభారం పెంచుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గ్రేడింగ్ విధానాన్ని తీసుకొచ్చి ఇచ్చే తక్కువ వేతనం కూడా ఇవ్వడం లేదని, ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించిన దానికి కట్టుబడి ఉండి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు, రూ.10 లక్షల బీమా సౌకర్యం, సెర్ప్ ఉద్యోగులతో సమానంగా వేతనాలను నేరుగా ఖాతాల్లో జమచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వీఓఏలు మహాధర్నా కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో ఐకేపీ వీఓఏల సంఘం నాయకులు సాయినాథ్, జయంత్‌కుమార్, సునీత, జ్యోతి, జమున, వెన్నెల, స్వప్న, అంబావతి పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

యువకులు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని గుండపెల్లి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్ విజేత కుడ జట్టుకు రూ.11,500, రెండో బహుమతి కమ్మర్‌గాం జట్టుకు రూ.6 వేల నగదుతో పాటు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని, క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి అవసరమైన సహాయాన్ని అందజేస్తానన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని మురళీగూడ, కమ్మర్‌గాం గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని, పోడు భూములకు త్వరలోనే పట్టాలు వస్తాయని, మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కలిసి గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల వేతనాలు చెల్లించేందుకు కృషి చేయాలని, ఉపాధ్యాయులు 317 జీవోను రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పోరిశెట్టి ఈశ్వరి, మధునయ్య శ్రీనివాస్, సంజీవ్, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతి, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ క్యాలెండర్ విడుదల

నవతెలంగాణ-వాంకిడి



పాత ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ముండె విమలాబాయి, విద్యాశాఖ అధికారి మనుకుమార్, సర్పంచ్ తుకారాం మంగళవారం డీవైఎఫ్ఐ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీవైఎఫ్ఐ యువతను ప్రోత్సహించడంలో ముందుంటుందని, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. యువతకు క్రీడలు ఏర్పాటు చేసి వారిని ప్రోత్సహిస్తుందన్నారు. మండలంలో అనేక సమస్యలపై పోరాటాలు నిర్వహించి యువతను చైతన్య పరుస్తుందని, యువత అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సర్పంచ్‌ల అధ్యక్షుడు సిడాం అన్నిగ, ఎస్ఐ సాగర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, ఏపీఎం చునార్కర్ శ్రావణ్, కమాన ఎంపీటీసీ ప్రవీణ్, సర్పంచ్‌లు జుగునాక మనోహర్, నీలాబాయి, భాగ్యశ్రీ, గోయగావ్ ఉప సర్పంచ్ సయ్యద్ హిమామ్, బౌద్ధ మహాసభ అధ్యక్షుడు మౌల్కార్ అశోక్, గోండ్వాన జిల్లా అధ్యక్షుడు పెందూర్ సుధాకర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, తిరుపతి, రాజేశ్వర్, రాజ్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనార్టీ రుణాల ఇంటర్వ్యూలు బహిష్కరణ



నవతెలంగాణ - సిర్పూర్(టి)

ప్రభుత్వం 2022-23 సంవత్సరానికి రుణాల మంజూరుకు మైనార్టీ అభ్యర్థులకు జనాభా ప్రాతిపదికన యూనిట్లను కేటాయించలేదని ఎంపీటీసీ సోయల్ హైమద్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మైనార్టీ రుణాల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలను లబ్దిదారులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సోయల్ హైమద్ మాట్లాడుతూ మైనార్టీ అభ్యర్థుల నుండి ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాల కోసం దరఖాస్తులను స్వీకరించిందని, జనాభాకు అనుగుణంగా యూనిట్లు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ఈ ఇంటర్వ్యూ కోసం మండలంలో 131 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసే కేవలం రెండు యూనిట్లు కేటాయించిందన్నారు. మైనార్టీల అభివృద్ధి కోసం ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తోందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే అధికారుల నుండి వివరాలు సేకరించి దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులకు యూనిట్లు కేటాయించి లబ్ది చేకూర్చాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎంపీడీఓ రాజేశ్వర్‌ను వివరణ కోసం అభ్యర్థులు ఇంటర్వ్యూలను వాయిదా వేయాలని కోరడంతో జిల్లా మైనార్టీ ఉన్నతాధికారులకు సమాచారంతో పాటు లబ్దిదారుల విజ్ఞప్తి మేరకు యూనిట్లను కేటాయించే విధంగా సహకరించాలని ఉన్నతాధికారులు తెలిపారన్నారు.

పిల్లల సమస్యలపై మండల స్థాయి సమీక్షా సమావేశం



ఆదిలాబాద్‌రూరల్ : మహిత సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా బాలల పరిరక్షణ కార్యాలయంలో ఆదిలాబాద్ రూరల్ మండల గ్రామస్థాయి బాలల సంరక్షణ సంఘాలతో సంరక్షణ సంఘం సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో పిల్లలు గ్రామస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గండ్రత్ రమేష్ మాట్లాడుతూ మండలం పరిధిలో ఉన్న ప్రతి గ్రామంలో ప్రొటెక్షన్ కమిటీ చైర్మన్లందరూ పిల్లలు పనిలో కాకుండా బడిలోనే ఉండే విధంగా చూడాలని తెలిపారు. బాల్యవివాహాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పిల్లల సంరక్షణ మన అందరి బాధ్యతని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, శైలజ, కోఆర్డినేటర్ తిరుపతి, సిడబ్ల్యూసి సభ్యులు సమీరుల్లాఖాన్, దశరథ్, డేవిడ్, లేబర్ ఆఫీసర్ వినోద్, మహిత కోఆర్డినేటర్ శ్రీకాంత్, ఆదిలాబాద్ రూరల్ మండల పరిధిలోని వివిధ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎస్ఎంసి సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నార్నూర్



సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కళాశాల విద్యార్థులకు పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గంగారెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసు సిబ్బందితో కలిసి విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. 100కు డయల్ చేసి సంబంధించిన సమాచారాన్ని సవివరంగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.ఉదయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బాలాజీ కాంబ్లే, అధ్యాపకులు రాథోడ్ శ్రీనివాస్, ఎల్ సుజాత, ఎల్ శారద, గజానంద్ ఉన్నారు.

కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సారంగాపూర్



కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మెన్ మాణిక్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆలూరు గ్రామంలోని రైతు వేదికలో కంటి వెలుగు శిబిరంలో తను కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని కంటి చూపును మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్ గండు రాధ సాయికృష్ణ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐలో చేరిన గుండాల రమేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ముందుండి పోరాడుతుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకుడు గుండాల రమేష్ ఎస్ఎఫ్ఐలో చేరారు. ఆయనకు ఆత్రం నగేష్ ఎస్ఎఫ్ఐ కండువా కప్పి సాదరంగా సంఘంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యత్వ రసీదును అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎస్ఐ కొట్నాక్ సకారం ఉన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నిర్మల్

అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి తన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై మాట్లాడాలని, ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు పెంచే విధంగా కృషి చేయాలని మంత్రిని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ పరిరక్షణ చేయాలని, అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్నా సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు సుజాత, జిల్లా కార్యదర్శి లలిత, ఉపాధ్యక్షురాలు శైలజ, శశికళ, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

దృష్టి లోపం సవరణకు కంటి వెలుగు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దృష్టి లోపం సవరణకు కంటి వెలుగు ఉపయోగపడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కోర్టు ఆవరణలో కంటి వెలుగు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి కోర్టు సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కంటి చూపు లోపం వలన చాలామంది బాధపడటం జరుగుతుందని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం తన కంటి పరీక్షలను చేయించుకున్నారు. ఇతర జిల్లా కోర్టులోని న్యాయాధికారులు, సిబ్బంది, న్యాయవాదులు కంటి పరీక్షలను నిర్వహించుకున్నారు. అవసరమైన వారికే రీడింగ్ గ్లాసులు తక్షణమే అందించారు. ప్రిస్క్రిప్టెడ్ అద్దాలకు ఇండెంట్ పంపించడం జరిగిందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్ తెలిపారు. బఫర్ టీమ్ ద్వారా ఎక్కువ సిబ్బంది ఉన్న కార్యాలయాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ శిబిరంలో న్యాయాధికారులు మాధవి కృష్ణ, ఎం.సతీష్ కుమార్, ప్రమీల జైన్, మంజుల సూర్యవార్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి క్షమా దేశ్ పాండేలు పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నగేష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముస్కు రమణ రెడ్డి, జిల్లా కోర్టు పరిపాలనాధికారి సూర్యకాంత్, పర్యవేక్షకులు మోహన్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమిష్టి కృషితో లాభాలు

నవతెలంగాణ-ఉట్నూర్

ఆర్టీసీ ఉద్యోగుల సమిష్టి కృషితో డిపోకు లాభాలు వస్తున్నాయని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన అన్నారు. మంగళవారం ఉట్నూర్ బస్‌డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడం జరుగుతుందని అన్నారు. ఉట్నూర్ డిపోలో సిబ్బంది సరస్పర సహకారంతో లాభాలు చేకూరుతున్నాయని అన్నారు. డిపోలు మొత్తం 31 బస్సులు ఉన్నాయని అన్నారు. అందులో పల్లె వెలుగు బస్సులు, సూపర్ లగ్జరీలు, ఉన్నాయని అన్నారు. అదనంగా కొత్తగా 2 సూపర్ లగ్జరీ బస్సులు డిపోకు త్వరలో రానున్నాయని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం, ఆదాయం వచ్చే రూట్లలో నిర్మల్ జిల్లాలోని బాసర, జగిత్యాల బస్సులు త్వరలో నడుపనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఉట్నూర్ నుండి ఆదిలాబాద్‌కు ఒక నాన్ స్టాప్ బస్సు నడుపనున్నట్లు తెలిపారు. బస్సు కేఎంపీఎల్ రావడానికి డ్రైవర్ల కృషిని అభినందించారు. ఆమె వెంట ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ జనార్ధన్, కంట్రోలర్ రామకృష్ణ, శంకరయ్య, సూపరింటెండెంట్ మూర్తి, ఉద్యోగులు ఉషాతాయి, రతన్ సింగ్ ఉన్నారు.

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో బీసీలకు రూ.10 వేల కోట్లు కేటాయించాలి

నవతెలంగాణ-నిర్మల్

2023-24 తెలంగాణా రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో ప్రభుత్వం బీసీలకు రూ.10 వేల కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎంబడి. చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గత వార్షిక బడ్జెట్ 2022-23లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నామని చెప్పి అందులో నుండి 25 శాతం కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. ఐదు సంవత్సరాల క్రితం బీసీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నవాళ్లందరికి బీసీబంధు పథకం ఏర్పాటు చేసి, ఒక్కొక్కరికి రూ. 10 లక్షల రుణం అందించాలని అన్నారు. అంతే కాకుండా బీసీ విద్యార్థులు, బీసీ యువత, చదువుకుంటున్న బీసీ విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ కోసం వెంటనే బీసీ సబ్ ప్లాన్‌ను ఈ బడ్జెట్‌లోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల కన్నెర్ర

- బైంసాలో సబ్ స్టేషన్‌ను ముట్టడించి, సిబ్బందిని నిర్బంధించిన రైతులు
- తాంసి, తలమడుగులో రాస్తారోకో



నవతెలంగాణ-బైంసా

గత పది రోజులుగా విద్యుత్ కోతలు అధికంగా ఉండటంతో కేవలం దినంలో నాలుగు, ఐదు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా కావడంతో పంటలు ఎండిపోగా రైతులు కన్నెర్ర చేశారు. మంగళవారం బైంసా మండలంలోని మహాగం, ఎగ్గామ్ గ్రామ రైతులు, ఎగ్గామ్ సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. అక్కడే ఉన్న సిబ్బందిని గంటకుపైగా నిర్బంధించి, ఆందోళన చేపట్టారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసే వరకు వదిలే ప్రసక్తే లేదని బైఠాయించారు. విద్యుత్ కోతలతో చేతి కందివచ్చిన పంటలు ఎండిపోతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం24 గంటల విద్యుత్ సరఫరా ఇస్తామన్న మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రెండు గంటల పాటు వ్యవసాయాన్ని వదిలిన రైతులు సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టడంతో అధికార యంత్రాంగం దిగివచ్చింది. సమస్య పరిష్కరిస్తామని ఆందోళన విరమించాలని బైంసా ఏడీ, రూరల్ పోలీస్ అధికారులు రైతులను సముదాయించారు. దీంతో శాంతించిన రైతులు ఆందోళన విరమించారు. ఆందోళనలో కోతుల్ గామ్, చింతల్ బోరి, బిజ్జూర్, ఎగ్గామ్, మహాగం, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తలమడుగు : అతివృష్టితో పంటలు దిగుబడి రాక కనీసం రబీ పంటలు వేసుకొని అయినా నష్టాన్ని రాబడతామనే ఉద్దేశంతో రైతులు ఉన్నప్పటికీ కరెంటు సరఫరా అందించక పోవడంతో రబీ పంటలు ఎండుతున్నాయంటూ ఖోడద్ గ్రామ రైతులు అంతరాష్ట్ర రహదారిపై దాదాపు మూడు గంటల పాటు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 24గంటల ఉచిత విద్యుత్తు ఇస్తామంటున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు కోతలు విధించడంతో రబీ పంటలు కండ్ల ముందు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు 24 గంటలు త్రీఫేస్ విద్యుత్తు అందించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. లేనిపక్షంలో వంతుల వారీగా రాస్తారోకో నిర్వహిస్తామని గ్రామ రైతులు తెలిపారు.

తాంసి: వేసవి కాలనికి వేసిన పంటలకు విద్యుత్ సరఫరాలో కోతలు విదించడంతో పంటలకు సరిపడా నీళ్లు అందకపోవడంతో వేసిన పంటలు ఎండిపోవడంతో మంగళవారం హస్నాపూర్ రైతులు రోడ్డుపై బైఠాయించారు ఇరవై నాలుగు గంటలు విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వర్షాకాలంలో అధిక వర్షాల కారణంగా పత్తి, సోయా పంటలు దెబ్బతిన్నాయి. కొంతమేర పత్తి పంట పండినప్పటికి కనీస మద్దతు ధర లేక రైతులకు, పెట్టిన పెట్టుబడి వెళ్లే పరిస్థితి లేదని అన్నారు. వేసవి పంటలు వేసుకొని నష్టాన్ని పుడ్చుకుందామంటే విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తున్నారని అన్నారు. ఆరు గంటలు కూడా విద్యుత్ సరఫరా కావడం లేదని రైతులు ఆరోపించారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని గొప్పగా చెప్పుకొనే ప్రభుత్వాలు రైతుల కష్టాలు కనబడుట లేద అని అన్నారు. వెంటనే ప్రభుత్వం రైతులకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేయడానికి కృషి చేయాలని కోరారు. దాదాపు నాలుగు గంటలు రోడ్డుపై బైఠాయించడంతో రాకపోకలకు నిలిచిపోయాయి. సంఘటన స్థలానికి తాంసి ఎస్ఐ ధనశ్రీ తమ సిబ్బందితో చేరుకొని రైతులను సముదాయించి, రాస్తారోకో విరమింప జేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మధుకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి. సుధాకర్, తిరుపతి రెడ్డి, రాములు, పొచ్చన్న ఉన్నారు.





నాలుగో రోజుకు చేరిన నర్సుల సమ్మె

- కండ్లకు గంతలు కట్టుకొని నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో పనిచేస్తున్న 300 ఓసీఎస్ స్టాఫ్‌నర్స్‌ల 8 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని, కంటిన్యూయేషన్ లెటర్లను ఇవ్వాలని, తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. మంగళవారం నాలుగో రోజు సమ్మెలో భాగంగా కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో 300 ఓసీఎస్ స్టాఫ్ నర్సులు 42 మంది ప్రభుత్వ కాంట్రాక్టులో గత నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నారని అన్నారు. కరోనా కష్టకాలంలోనూ ఫ్రంట్ లైన్ వారియర్లుగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించారని అన్నారు. 11వ పీఆర్సీ విషయంలోనూ సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా వీరికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. గత ఎనిమిది నెలలుగా వేతనాలు చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. వీరందరూ ఇతర ప్రాంతాల జిల్లాల నుండి వచ్చి ఇక్కడ సేవలందిస్తున్నారని అన్నారు. 8 నెలలుగా వేతనాలు చెల్లించకుండా వీరి కుటుంబాలను ఎట్లా పోషించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామని అన్నారు. సమస్యల పరిష్కారానికై రిమ్స్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్, డీఎంఈ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని పలు సందర్భాల్లో కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. జిల్లా అధికారులు, డీఎంఈ, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వెంటనే స్పందించి 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీదర్, స్టాఫ్‌నర్స్‌లు రాజ్యలక్ష్మి, కమల, మీనాక్షి, సురేఖ, శ్రీలత, కృష్ణకుమారి, అరుణ, పెర్సి, విశాల పాల్గొన్నారు.

మన ఊరు-మన బడి పనుల పరిశీలన



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మన ఊరు మన బడి, మన బస్తి మన బడి, కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చేపట్టిన పనులు పూర్తి అయినవాటి, బుధవారం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని విద్యానగర్, హమీద్‌పుర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ పరిశీలించారు. ఆయా పాఠశాలల్లోని తరగతి గదులు, మరుగుదొడ్లు, తదితర పనులను పరిశీలించి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయాలనీ జిల్లా విద్యాశాఖ అధికారిణిని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యానగర్ తెలుగుమీడియంలో రూ.21.63 లక్షలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హమీద్‌పుర ఉర్దూ మీడియంలో రూ.21.90 లక్షలతో పనులు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో చేపట్టిన పనులను కలెక్టర్ పరిశీలించి, తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. డ్యూయల్ డెస్క్, బోర్డు, ఫ్యాన్స్, తదితర ఏర్పాట్లపై ఎలా ఉన్నాయని విద్యార్థులను అడుగగా విద్యార్థులు సూపర్‌గా ఉన్నాయని కలెక్టర్‌కు బదులిచ్చారు. విద్యార్థులు విద్యాబోధన, ఇప్పటి వరకు నేర్చుకున్న పాఠ్యాంశాలపై కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు బుధవారం రోజున మన ఊరు మన బడి కింద పనులు చేపట్టబడిన పాఠశాలలను ప్రారంభోత్సవం చేసుకోనున్నామని తెలిపారు. అందుకు ఏర్పాట్ల పనుల పరిశీలనకు పాఠశాలను తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మొదటి దశ కింద 237 పాఠశాలల్లో మన ఊరు మన బడి పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. 37 మోడల్ పాఠశాలలను గుర్తించి సివిల్ పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. అందులో 20 పాఠశాలల్లో ఉపాధి హామీ పనులు పూర్తిచేయడం జరిగిందని తెలిపారు. ఆయా పాఠశాలల్లో డ్యూయల్ డెస్క్, గ్రీన్‌చాక్ బోర్డు సరఫరా కోసం నీల్ కమల్ ఏజెన్సీ నుండి సరఫరా కావాల్సి ఉందని, అట్టి ఫర్నిచర్ సరఫరా అయిన వెంటనే ఆయా పాఠశాలలను ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. మన ఊరు మన బడి కింద పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ప్రభుత్వం సూచించిన ఒకేవిధమైన సుందర రంగులను వేయడం జరిగిందని తెలిపారు. వచ్చే విద్య సంవత్సరంలో విద్యార్థులు ఉత్సాహంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరి విద్యను అభ్యసిస్తారని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, ఎంఈఓ జయశీల, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



నవతెలంగాణ-ముధోల్

ప్రజల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అన్నారు. నియోజవర్గ కేంద్రమైన ముధోల్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆడబిడ్డల పెండ్లిల కోసం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. సీఎం కేసీఆర్ ఆడబిడ్డల తల్లిదండ్రులకు ఆర్థికంగా అండగా ఉండటానికి ఈ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ముధోల్ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 59 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. పెండింగ్‌లో ఉన్న చెక్కులను సైతం త్వరలో పంపిణీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్, నయాబ్ తహసీల్దార్ ఆసిఫ్, ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, ముధోల్ సర్పంచ్ వెంకటపూర్ రాజేందర్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి రాంచందర్, బీఆర్ఎస్ మండల నాయకులు రవీందర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, రోళ్ల రమేష్, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఆర్ఐ అభిమాన్యు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వరల్డ్ విజన్ ఆధ్వర్యంలో పౌష్టిక ఆహారం పంపిణీ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని వడ్యాల్ గ్రామంలో వరల్డ్ విజన్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పోషకాహారం లోపం కలిగిన బాలలకు, మహిళలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఆర్డీఓ విజయలక్ష్మి హజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరల్డ్ విజన్ సంస్థ సేవలను కొనియాడారు. రానున్న రోజుల్లో మరింత మందికి పౌష్టికాహారన్ని అందివ్వాలని ఆకాంక్షించారు. వరల్డ్ విజన్ యొక్క సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సంస్థ మేనేజర్ బ్రహ్మన్న పేర్కొన్నారు. మండలంలో పౌష్టికాహార లోపంతో బాధపడేవారు ఎవరు ఉండకూడదనే ఉద్దేశంతో వరల్డ్ విజన్ ఈ కార్యక్రమాన్ని చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్ భాగ్య, ఎంపీడీఓ మోహన్ పాల్గొన్నారు.

పంటల్లో డ్రోన్‌తో పురుగులమందు పిచికారిపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని పరిశోధన సంస్థ దత్తత గ్రామమైన సిర్సన్న గ్రామంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో పంటల్లో డ్రోన్ సహాయంతో పురుగులమందు ఎలా పిచికారి చేయాలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కే.రాజశేఖర్ రైతులకి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కూలీల కొరత, కూలీల సామర్థ్యం తగ్గడం వల్ల సరైన సమయంలో పిచ్చికారి చేయలేకపోతున్నామని అన్నారు. దీనివల్ల పంట నష్టం ఏర్పడుతుందని అన్నారు. డ్రోన్‌ను ఉపయోగించి తక్కువ సమయంలో ఎక్కువ ఎకరాలకి పిచికారి చేయవచ్చని అన్నారు. ఈ డ్రోన్‌లో ఎకరానికి 15 లీటర్ల నీరును ఉపయోగించాలని అన్నారు. ఇది 10 నిమిషాలలో ఒక ఎకరానికి స్ప్రే చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.మోహన్ దాస్, ఏఈఓ రమణ రైతులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభ

- సర్పంచ్ కొరెంగ గాంధారి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభ నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ కొరెంగ గాంధారి అన్నారు. మంగళవారం ఇంద్రవెల్లి గ్రామపంచాయతీలో ఆమె అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వార్డులో గతంలో చేసిన సీసీ రోడ్లతో పాటు, డ్రైనేజీ, అసంపూర్తి పనులను పూర్తి చేయాలని పలువురు వార్డు సభ్యులు ఆమె దృష్టికి తెచ్చారు. అనంతరం పలు వార్డులో ప్రజల మౌలిక వసతుల కోసం చేపట్టాల్సిన పనులపై తీర్మానం చేశారు. ప్రభుత్వం ఆరంభించిన కంటి వెలుగును కండ్ల సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ గ్రామసభలో ఎంపీఓ సంతోష్, ఈఓ సంజీవ్ రావు, ఎంపీటీసీ, గిత్తే ఆశ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-కుభీర్



గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జంగావ్‌లో మురికి కాలువలు, సెరిపెల్లి తండ గ్రామంలో రూ.2లక్షల గ్రావెల్, కిషన్ నాయక్ తండలో, డోడర్నా రూ.14లక్షల సీసీ, దేవాదాయ శాఖ నుంచి రూ.20లక్షలతో హనుమాన్ మందిర్ రూ.4లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సమితి గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేయడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా 5న మహారాష్ట్రలోని నాందేడ్‌లో కేసీఆర్ సభ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. దానికి మండలం నుంచి అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు తరలిరావాలని కార్యకర్తలకు సూచించారు. దీంతో పాటు అన్ని గ్రామాల్లో ఉన్న ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మండలంలోని పార్డి(కె) గ్రామానికి చెందిన మైస రాజమణి, సారికలకు రూ.1లక్ష 50 వేలుచొప్పున సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను అబ్దిదారులకు పంపిణీ చేశారు. వీరికి వివిధ కారణాల వల్ల అనారోగ్యంతో బాధపడుతుండగా వారికి సీఎం సహాయ నిధి కింద మంజూరి చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, జెడ్పీటీసీ ఆల్కతాయి సంజయ్, మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్, కోఆప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్, మండల రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల పీరాజి, సర్పంచ్‌లు సంఘం అధ్యక్షుడు దత్తు గౌడ్, మీరా విజయ్ కుమార్, ఆయా గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు ఉన్నారు.

నాగోబాను దర్శించుకున్న ఎస్పీ కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే ప్రసిద్ధి పొందిన కేస్లాపూర్‌లోని నాగోబా దేవతకు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి సతీమణి అరుణతో పాటు వారి కుటుంబసభ్యులు మంగళవారం దర్శించుకున్నారు. వీరికి పూజారి షేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగోబా మోమెంటోను ప్రదానం చేసి సత్కరించారు.

టీడబ్ల్యూటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని జామడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులు తెలంగాణ స్టేట్ ట్రైబల్ వెల్ఫేర్ టీచర్ యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు వారికి ఉన్న సమస్యలను విన్నవించారు. పాఠశాల నుండి సంఘంలో ఐదుగురు సభ్యులుగా ఉండటం చాలా సంతోషకరమని అభిప్రాయ పడ్డారు. క్యాలెండర్ ఆవిష్కరణలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ నెహ్రూ, ఉపాధ్యాయులు పుష్పలత, ప్రేమ్ కుమార్, విశ్వనాథ్, శివాజీ, బాలాజీ, సునీత, చంపావతి, హరిచంద్, గంగాధర్, రాజు, సుజాత, కైలాష్, ఉన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు.మంగళవారం బోయపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పంచేంద్రియాలలో ప్రధానమైన కన్నులను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. యువకులు వృద్దులు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ది పొందాలని సూచించారు. కంటి వెలుగు కేంద్రాన్ని జడ్పీటీసీ బానయ్య, బోయపల్లి ఉప సర్పంచ్ రైతు వెంకటేశం సందర్శించారు. కంటి వెలుగు కార్యక్రమంలో 21 మంది లబ్ధిదారులకు పరీక్షలు నిర్వహించగా 53 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. 49 మందికి మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కల్పన, ఏఎన్ఎం తులసి, అనసూయ అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, ఆశా కార్యకర్తలు మల్లేశ్వరి పాల్గొన్నారు.

జనగామలో కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని జనగామ గ్రామంలో మంగళవారం సర్పంచ్ గట్టు లక్ష్మణ్ గౌడ్, ఎంపీటీసీ మర్నెట్టి తిరుపతి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గట్టు లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకొని, అవసరమైన వారు వైద్యుల సూచనల మేరకు కంటి అద్దాలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యులు అజ్గర్ , పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్, కోఆప్షన్ సభ్యుడు గరీబ్ ఖాన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఓదెల్, జనగామ ఉప సర్పంచ్ తలండి శంకర్, సూపాక సర్పంచ్ సతీష్, సిర్స సర్పంచ్ పున్నంచందు, మాజీ ఎంపీపీ వెంకట స్వామి, మాజీ సర్పంచ్ అల్లూరు చంద్రు, గ్రామ రైతు సమన్వయ సమితి కన్వీనర్ రాజన్న, వార్డ్ సభ్యులు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఏరియాలో రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో గత నెలలో కంటే ప్రస్తుతం రికార్డ్ స్థాయిలో బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తి చేయడమే కాకుండా రోడ్డు, రైల్ మార్గాలలో 7 లక్షల 43 వేల9 వందల 51 టన్నుల రవాణా చేయడం జరిగిందని తెలిపారు. దీనికి కృషి చేసిన అధికారులకు, కార్మికులకు, యూనియన్ నాయకులకు అభినందనలు తెలిపారు. ఆర్కే-6 ముందుగానే ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించిందని, రెండు నెలల్లో ఏరియా అన్ని గనుల్లో ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకుంటుందని అన్నారు. అలాగే సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని, సింగరేణి వ్యాప్తంగా గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. రానున్న వర్షాకాల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కారుణ్య నియామకలో భాగంగా జనవరి నెలలో 41 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామని, రక్తదాన శిబిరాలు, సురభి నాటక ప్రదర్శన, అలాగే క్వాలిటీ ముగింపు వేడుకలను నిర్వహించామని తెలిపారు. ఫిబ్రవరి 2, 3 తేదీలలో సీసీసీ, సీఈఆర్ క్లబ్‌లో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఓ టూ జీఎం త్యాగరాజు, డీజీఎం పర్సనల్ గోవిందరాజు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

నవతెలంగాణ-జన్నారం

చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని లక్షెట్టిపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మొహమ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. మంగళవారం మండలంలోని కలమడుగు గ్రామ జడ్పీ పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రజల మేలుకోసమే చట్టాలు తయారు చేస్తారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏజీపీ పద్మ, బార్ అసోసియేషన్ వీపీ గాండ్ల సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు, రాజేశ్వరరావు, శ్రీధర్, రహమతుల్లా, ప్రకాశం అశోక్, సత్యా గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాడి ప్రభాకర్, గ్రామ సర్పంచ్ యాదగిరి కార్తికరావు, నర నారాయణస్వామి, ఆలయ కమిటీ చైర్మన్ యాదగిరి స్వదేశీ రావు, ఎన్‌సీసీ అధికారి కట్ట రాజమౌళి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి ఘన సన్మానం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరామ్ ఏరియాలో పదవి రమణ పొందిన సింగరేణి అధికారులకు, కార్మికులను మంగళవారం జీఎం కార్యాలయంతో పాటు పలు గనులపై ఘనంగా సన్మానించారు. జనరల్ మేనేజర్ కార్యాలయంలో పదవీ విరమణ పొందుతున్న ఏరియా రక్షణాధికారి గోసిక మల్లేష్‌ని ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి ఘనంగా సన్మానించారు. అలాగే ఆర్కే5,6,7, న్యూ టెక్, ఉపరితల గనిలో పదవి విరమణ పొందిన కార్మికులను ఆయా గని మేనేజర్లు అబ్దుల్ ఖాదిర్, తిరుపతి, సాయి ప్రసాద్, స్వామి రాజు, సుధీర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీలో 35 సంవత్సరాల 2నెలల పాటు వివిధ హెూదాలలో పనిచేసి, పదవీ విరమణ పొందుతున్న గోసిక మల్లేష్‌కు అభినందనలు తెలిపారు. ఉద్యోగం చేస్తున్న ప్రతి ఒక్కరికి పదవి విరమణ అనేది అనివార్యమని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.

వరిలో సస్య రక్షణ చర్యలు పాటించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు తమ వరి పంటను కాపాడుకునేందుకు పలు సస్య రక్షణ చర్యలు పాటించాలని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ సూచించారు. మంగళవారం నజ్రూల్‌నగర్, గన్నారం గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించి ప్రస్తుత సీజన్‌లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. ప్రస్తుతం వరి పొలాల్లో మొగిపురుగు ఉధృతి ఉందని, అలాగే వేరుకుళ్లు సైతం గమనించడం జరిగిందన్నారు. మొగిపురుగు నివారణకు ఎకరానికి 10 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లుకోవాలని సూచించారు. గుళికల చల్లినప్పటికీ మొగిపురుగు పోనట్లయితే కోరాజిన్ 60 ఎంఎల్‌తో పాలిరామ్ కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏఈఓలు నమోదు చేసిన పంట వివరాలను అడిగి తెలుసుకోని రైతులు వేసిన పంట, ఆన్‌లైన్ చేసిన పంట ఒకటేనా అని పరిశీలించారు. ఈకేవైసీ చేసుకోని రైతులు త్వరగా కేవైసీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శైలేష్, ఉన్నారు.

ఖానాపూర్‌లో అభివృద్ధి ఎక్కడా..?

జన్నారం : ఖానాపూర్ నియోజకవర్గంలో ఎక్కడచూసిన అభివృద్ధి జాడ, కనిపించడం లేదని, ప్రజాప్రతినిధులు ఖానాపూర్ దోచుకున్నారని ఖానాపూర్ బీజేపీ అసెంబ్లీ నేత రమేష్ రాథోడ్ మండిపడ్డారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో 'ప్రజాగోస.. బీజేపీ భరోస' యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కవ్వాల్ హస్టల్ తండాకు చెందిన యువకులు రమేష్ రాథోడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ, కేసీఆర్ ప్రభుత్వ అవినీతిపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధి జపం చేస్తున్నారని, కాని ప్రజలకు చేసిందేమి లేదని అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో 8ఏళ్ళు గడుస్తున్నా ఒక ఎకరం ఆయకట్టు పెంచిన ఆనవాళ్లు లేవని పేర్కొన్నారు. సధర్మాట్ రైతులను బీఆర్ఎస్ నేతలు నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గ ప్రజలు తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

సమయపాలన తప్పక పాటించాలి

- డీఐఈఓ శ్రీదర్ సుమన్
- కళాశాలల సిబ్బందికి బైయోమెట్రిక్‌పై శిక్షణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది తప్పక సమయపాలన పాటించాలని డీఐఈఓ డా.శ్రీధర్ సుమన్ అన్నారు. మంగళవారం జిల్లా ఇంటర్ విద్య కార్యాలయంలో బయోమెట్రిక్ మిషన్లు వాటి పనితీరు, పాటించాల్సిన విధి విధానాల గురించి కూలంకశంగా తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆబాస్(ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్) మిషన్లు డిగ్రీ, పాలిటెక్నిక్, పాఠశాలల్లో విజయవంతంగా పని చేస్తున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర టెక్నికల్ సర్వీసెస్ (టీఎస్ టీఎస్) వారి ఆధ్వర్యంలో బయోమెట్రిక్ హాజరుకై ప్రత్యేక వెబ్ సైట్ రూపొందించబడిందని, ప్రతీ ఉద్యోగి ఆధార్ బయోమెట్రిక్‌తో హాజరు నమోదు చేయబడుతుందని తెలిపారు. ప్రతీ కళాశాలలో బయోమెట్రిక్ ఇన్‌ఛార్జి ఆధ్వర్యంలో మిషన్ ఆపరేటింగ్ నియమావళిని అమలు పరుస్తారన్నారు. జిల్లాలో 11 మంది ప్రిన్సిపాళ్లు, 162 మంది అధ్యాపకులు, 42 నాన్ టీచింగ్ సిబ్బంది ఉన్నారని వారందరూ బయోమెట్రిక్ హాజరు నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రతీరోజు కళాశాలల వారీగా హాజరును పర్యవేక్షించడం జరుగుతుందని, కళాశాలల ప్రిన్సిపాళ్ల నెలవారీ హాజరు రిపోర్టులు (ఇన్, ఔట్ పంచింగ్) జిల్లా కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్ రాందాస్, శంకర్, లక్ష్మణ్‌రావ్, అమరేందర్, కల్యానీ, రాజయ్య, పరుశురాం, అధ్యాపకులు సతీష్, శ్రీనివాస్, నవీన్‌రెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించలేని ప్రభుత్వాలు



నవతెలంగాణ-మంచిర్యాల

దేశానికి స్వాతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలు అవుతున్న మహిళలకు సరైన రక్షణ కల్పించడంలో పాలకవర్గాలు విఫలం చెందుతున్నాయని మహిళా సమైక్య రాష్ట్ర కార్యదర్శి ముడుపు నలినిరెడ్డి అన్నారు. మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో భారత మహిళా సమైక్య జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు బొల్లం సోనియా అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకురాకపోవడం వలన నిర్భయ లాంటి చట్టాలు ఉన్నప్పటికీ మహిళలపై హత్యలు అత్యాచారాలు ఆగడం లేదన్నారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. ప్రతి జిల్లాలో మహిళలకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. మండలానికి ఒక మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి కఠినమైన చట్టాలు తీసుకురావాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాలను కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, డ్వాక్రా గ్రూపు మహిళలకు వడ్డీ లేని రుణం రూ. పది లక్షలు ఇవ్వాలని, తెల్ల రేషన్ కార్డుపై నిత్యవసర సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరిగినటువంటి నిత్యవసర సరుకులు, గ్యాస్ ధరలను తగ్గించాలన్నారు. అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఆసరా పింఛన్‌లు ఇవ్వాలని, ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కౌన్సిల్ సమావేశంలో నిర్మానించినట్టు తెలిపారు. డిమాండ్ల సాధనకు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు బొల్లం పూర్ణిమ, రేగుంట చంద్రకళ, సీనియర్ నాయకురాలు గుండా సరోజన, బియ్యపు పద్మ, తోకల సరస్వతి, బియ్యాల భవాని, లింగం జమున, దుర్గం లక్ష్మి పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆవిర్భవ దినోత్సవ వేడకలు మంగళవారం సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు పాలాజీ శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, ద్విచక్ర వాహనాలతో భారీగా ర్యాలీ నిర్వహించారు. గల్ఫ్ సమస్యలపై మండల తహసీల్దార్ కిషన్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఇప్పటి వరకు 9 సంవత్సరాలు గడిచిన గల్ఫ్ కార్మికులకు చేసింది ఏమిలేదని, 2014 ఎన్నికల సమయంలో కేసీఆర్ బొంబాయి, బొగ్గుబాయి, దుబాయ్ వలసలు వెళ్లిన మన కార్మికులను వెనక్కి తెప్పించుకుని మన రాష్ట్రంలోనే వారికి ఉపాధిని కలిపిస్తామన్నారు. అలాగే గల్ఫ్ కార్మికుల కోసం కేరళ తరహాలో రూ.500 కోట్లు కేటాయించి సంక్షేమ బోర్డ్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారన్నరు. తెలంగాణ వచ్చి తొమ్మిదేండ్లు గడిచినా గల్ఫ్ కార్మికుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన గల్ఫ్ కార్మికులు 15 లక్షల మంది ఉన్నారని తెలిపారు. వారి ద్వారా నుంచి తెలంగాణ ప్రభుత్వానికి వచ్చే వార్షిక ఆదాయం రూ.10 వేల కోట్లు తమ భాగస్వామ్యం ఉందని మరిచిపోవద్దన్నారు. ప్రభుత్వ తమ డిమాండ్లను కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందన్నరు. కార్యక్రమంలో గల్ఫ్ కార్మికులు పాల్గొన్నారు.

అర్హులకు పోడు పట్టాలు అందేలా చర్యలు

- ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ప్రకారం పోడు భూములు సాగు చేసుకుంటున్న అర్హులైన గిరిజనులకు పోడు భూములు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్ పాయితో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయితీ కార్యదర్శులతో పోడు పట్టాల కోసం వచ్చిన దరఖాస్తులలో అర్హులైన వారి జాబితాను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరికి పోడు పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుతో పాటు 2 ఆధారాలు, 2005లో నివసిస్తున్నట్లు తప్పకుండా దరఖాస్తుకు జత చేయాలని, అర్హులైన వారు వివరాలు కచ్చితంగా జాబితాలో ఉండే విధంగా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజేశ్వర్, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి మణెమ్మ పాల్గొన్నారు.

ఆదాయ పన్ను మినహాయింపుకు బిల్లు పెట్టాలి

- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-మంచిర్యాల

సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను మినహాయింపుకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు పెట్టాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రాణాలను లెక్కచేయకుండా విధులు నిర్వహించే గని కార్మికుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. దేశ సైనికుల వలె సింగరేణి కార్మికుల సేవలు ఉంటాయని తెలిపారు. కోల్ ఇండియా తరహాలో సింగరేణి కార్మికులకు ఐటీ మినహాయింపు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ కార్యదర్శి షేక్ బాజీ సైదా, వీరభద్రయ్య, సమ్మయ్య, జిల్లా కార్యదర్శి మేకల దాసు, బ్రాంచ్ కార్యదర్శులు కిషన్‌రావు, కొమురయ్య పాల్గొన్నారు.



గ్రంథాలయాల్లో సౌకర్యాలు కల్పించడమే ప్రధాన లక్ష్యం

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ కనక యాదవరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాఠకుల గ్రంథాలయాల్లో సౌకర్యాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కనక యాదవరావు పునరుద్ఘాటించారు. జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయంలో ఆయన అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రెబ్బెన, సిర్పూర్(టి) గ్రంథాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, గత వర్షకాలం కురిసిన వర్షాలతో పుస్తకాలు చెడిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. వర్షానికి చెదలు పట్టిన పుస్తకాలను తీసివేసి వాటి స్థానంలో కొత్తవి కొనుగోలు చేయడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇతర గ్రంథాలయాల్లో కూడా చెడిపోయిన పుస్తకాలను తీసివేయడానికి నిర్ణయించినట్టు వివరించారు. ఇప్పటివరకు చెడిపోయిన పుస్తకాల స్థానంలో కొత్తవి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. గ్రంథాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది జీతాల పెంపుదలకు సంబంధించి ప్రతిపాదనలు పంపామన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో రూ.కోటితో నిర్మిస్తున్న జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి మునీశ్వర్, జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయ బాబు, సిబ్బంది వెంకటరమణ, సతీదేవి, సదానందం, సలీం పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌లో ప్లాట్లు కొని మోసపోవద్దు

నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ లేఔట్లలో ప్లాట్లు కొని మోసపోవద్దని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని అక్రమ వెంచెర్ల హద్దు రాళ్లు, గోడలు తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ నస్పూర్ మునిసిపల్ పరిధిలోని 10వ వార్డు పరిధిలోని వెలసిన అక్రమ లేఔట్ హద్దు రాళ్లు, ప్రహారిని తొలగించారు. అక్రమ లేఔట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి గృహ నిర్మాణ అనుమతులు లభించవని స్పష్టం చేశారు. ఇంకా ఎవరైనా అనుమతులు లేకుండా లేఔట్లు వేస్తే కఠిన చర్యలు తీసుకొని వెంటనే తొలగించబడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీఎస్ సతీష్, బిల్ కలెక్టర్ శ్రీపతి సురేష్ కుమార్ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల్లో గత విధానాన్ని అనుసరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతుల ప్రక్రియలు గతంలో మాదిరిగా ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ కోటాను అమలు చేయాలని గిరిజన ఉపాధ్యాయ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతాలు ఉన్నాయని అన్నారు. పదోన్నతులు బదిలీల ప్రక్రియలో గత విధానాన్ని అనుసరించకపోవడంతో అనేకమంది ఉపాధ్యాయులు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఏజెన్సీ, మైదాన ప్రాంతాలకు ప్రత్యేకంగా బదిలీలు పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ జేఏసీ సభ్యులు గంగారాం, జాదవ్ కిరణ్ కుమార్, కపిల్, భీమ్ రావ్, రాజుకుమార్, టీ.లక్ష్మణ్, శ్రీనివాస్, నగేష్, మనోహర్, చిన్ను శ్రీనివాస్, తుకారాం, తిరుపతి, అశోక్, నారాయణ, కైలాస్ పాల్గొన్నారు.

సైన్స్‌ఫేర్‌లో బాదంపెల్లి విద్యార్థి ప్రతిభ

నవతెలంణ-జన్నారం

కేరళ రాష్ట్రంలోని తిరుచూరులో నిర్వహిస్తున్న దక్షిణ భారతదేశ సైన్స్ ఫెయిర్ (2023)లో బాదంపెల్లి జడ్పీఎస్ఎస్ 9వ తరగతి విద్యార్థి జాడి జగదీశ్వర్, గైడ్ టీచర్ దేవ రాజయ్య ఫిజికల్ సైన్స్) ఇండివిజువల్ కేటగిరీలో ద్వితీయ బహుమతి గెలుపొందారని ఎంఈఓ ఎన్.విజయకుమార్ తెలిపారు. ఈ బహుమతి కింద రూ.5000 నగదు బహుమతి, మేమొంటో, సర్టిఫికెట్స్‌తో విద్యార్థి జగదీశ్వర్, గైడ్ టీచర్‌ని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జీవన్ బాబు ఐఏఎస్ కేరళ, కేరళ రాష్ట్రగవర్నమెంట్ ప్రతినిధులు రాజకీయ నాయకులు చేతుల మీదుగా ఈ బహుమతులను అందుకున్నట్లు పేర్కొన్నారు.

శ్రీరాంపూర్ ఏరియాలో పర్యటించిన సీఎస్ఓ

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో మంగళవారం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ సిహెచ్. శశిధర్ రాజు పర్యటించారు. ఏరియా జీఎం బి.సంజీవరెడ్డిని కలసి ఆస్తుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. అనంతరం వివిధ డ్యూటీ చెక్ పోస్టులను సందర్శించి పరిశీలించారు. శ్రీరాంపూర్ ఓసి చెక్ పోస్ట్ బూమ్ బ్యారల్స్ పని తీరును, సుశి డీజిల్ బంకులో పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ భద్రత సిబ్బంది విధి నిర్వహణలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, గేట్ల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. మెయింటేన్స్ చేస్తున్న రికార్డులను పరిశీలించి దొంగతనాలు జరగకుండా అరికట్టాలని సూచించారు. కార్యక్రమములో సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, విటిఎస్ ఇన్‌ఛార్జి సంపత్ రెడ్డి, సీనియర్ ఇన్స్‌పెక్టర్ అజీముద్దీన్, జమ్మేదార్ కె.కనకయ్య పాల్గొన్నారు.

జంతు సంరక్షణ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-మంచిర్యాల

జాతీయ జంతు సంరక్షణ పక్షోత్సవాల సందర్భంగా 'జంతు సంరక్షణ పౌరుల బాధ్యత' అనే అంశంపై ర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో పాఠశాలకు చెందిన పి.వరుణ్ తేజ, జి.అభినవ్, పి.అజయ్, ఎస్‌కె. రెహాన్, ఎస్.ముని, ఎస్.సాయి తేజ, అయాన్ లను పోటీలకు సమన్వయకర్తగా వ్యవహరించి విజయవంతం చేసిన జిల్లా విద్యాశాఖ పర్యావరణ విద్య శిక్షకుడు గుండేటి యోగేశ్వర్‌ను కలెక్టర్ భారతి హోళికేరి ప్రశంసించారు. ట్రైనీ కలెక్టర్ పూజారి గౌతమి, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డా.రమేష్ కుమార్, డీఈఓ ఎస్.వెంకటేశ్వర్లు ప్రశంస పత్రాలు జ్ఞాపిక అందించి అభినందించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను సీఎంఓ కె.చౌదరి, సెక్టోరియల్ అధికారి సబ్దర్ అలిఖాన్, హెచ్.ఎం. మాడుగుల దుర్గయ్య, ఉపాధ్యాయులు వేణుగోపాల్, యోగేశ్వర్ శ్రీనివాస్‌వర్మ, సి.శ్రీనివాస్, స్వామి, వెంకటేశ్వర్లు ,మహేష్, రాజమౌళి, నాగరాజు, రంగరాణీ భాగ్య లక్ష్మి, నీల్‌కమల్ తెలిపారు.

పౌర హక్కులపై అవగాహన

నవతెలంగాణ - పెంచికల్‌పేట్



మండలంలోని పోతపెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పౌరహక్కుల రోజు సందర్భంగా తహసీల్దార్ సరిత, సర్పంచ్ దాసరి చంద్రమౌళి అధ్యక్షతన గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌరుల హక్కులకు భంగం కల్గకుండా చూడాలని, అంటరానితనాన్ని నిర్మూలించాలని, ప్రతి పౌరుడు హక్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గంగారాం, ఏఈఓ గౌసియాభేగం, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌లు గోపాల్, సురేష్, పంచాయతీ కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో జాతర విజయవంతం

- ఆలయ కమిటీ ఛైర్మన్ మెస్రం తుకారాం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

అందరి సహకారంతో జాతర విజయవంతమైందని ఆలయ కమిటీ ఛైర్మన్ మెస్రం తుకారాం అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రెండవ అతిపెద్ద జాతరగా గుర్తింపు పొందిన నాగోబా జాతర ఈ నెల 21 నుంచి 28 వరకు కొనసాగిందన్నారు. జాతరలో భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా కృషి చేసిన కలెక్టర్, ఐటిడిఏ పిఓ, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. భక్తులకు సురక్షితమైన తాగునీరు, సానిటేషన్, విద్యుత్ సౌకర్యంతో పాటు 24 గంటలు పనిచేసిన పంచాయతీ సిబ్బందికి ఆలయ కమిటీ, మెస్రం వంశీయుల తరపున ధన్యవాదాలు తెలిపారు. విలేకరుల సమావేశంలో బారిక్‌రావ్, రేణుక నాగనాథ్ పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి



నవతెలంగాణ - సిర్పూర్(టి)

అడవిలో నివసించే వన్యప్రాణులను, అడవిని సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ వల్క మోహన్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని సిర్పూర్ రేంజ్ పరిధిలో చీలపెల్లి గ్రామంలో అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై ర్యాలీ, అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలు అడవులను నరకడం, వన్యప్రాణులను వేటాడడం, ఉచ్చులు, విద్యుత్ తీగలను అమర్చవద్దని తెలిపారు. మనలాగే అవి కూడా జీవులని గుర్తించాలన్నారు. వన్యప్రాణులు, అడవులు నశించిపోవడం వల్ల జీవకోటికి ప్రాణహాని ఉంటుందని, అడవులను సంరక్షించినప్పుడే మనుషులకు కావాల్సిన వాతావరణంలో పలు మార్పులు జరుగుతాయన్నారు. గతంలో ఉచ్చులకు తగిలి వన్య ప్రాణులు ప్రాణాలు కోల్పోయాయన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా గుర్తించి అడవులను, వన్యప్రాణులను సంరక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీట్ అధికారులు షాహిద్, నరేష్, అరవింద్, గోపాల్, సత్తయ్య గ్రామపెద్దలు, మాజీ సర్పంచ్ సుర్పం అర్జు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సామూహిక రుగ్మతలను నివారించాలి



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

సామూహిక రుగ్మతలను నివారణ కోసం పోలీసుల ఆధ్వర్యంలో సామూహిక రుగ్మతల నివారణ కళాకారులతో ధూంధాం కార్యక్రమాన్ని మండలంలోని పోతపెల్లి గ్రామ పంచాయతీలో కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మూఢనమ్మకాలను నమ్మకూడదని తెలిపారు. యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి చంద్రమౌళి, ఎస్ఐ విజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి : మంత్రి అల్లోల

నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిట్యాల గ్రామంలో రూ.26లక్షల వ్యయంతో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ ప్రహారీ గోడ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయాల అభివృద్ధికి పూర్వ వైభవం వచ్చిందన్నారు. అందులో భాగంగానే సీఎం కేసీఆర్ యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని కోట్ల రూపాయలతో అద్భుత క్షేత్రంగా తీర్చిదిద్దారని తెలిపారు. అదేవిధంగా నిర్మల్ నియోజకవర్గంలో వందలాది ఆలయాలను అభివృద్ధి చేశామన్నారు. అనంతరం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ పడకండి రమేష్‌రెడ్డి, నాయకులు మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

యువత సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని ఎస్సై డి.సునీల్ అన్నారు. మంగళవారం మండలంలోని మారుమూల గ్రామం పిట్టబొంగరంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. లక్కీ లాటరీ తలిగిందని బ్యాంక్ అకౌంట్ తెలపాలని ఇలా అనేక విధాలుగా మోసగిస్తారని పేర్కొన్నారు. ఏటీఎం పిన్ నెంబర్లను బ్యాంకు అధికారుల పేరిట ఫోన్‌కాల్ వస్తే నమ్మకూడదని, వివరాలను తెలపకూడదని పేర్కొన్నారు. దీంతో పాటు సోషల్ మీడియాలో ఇతర మతాలను, వ్యక్తిని కించపర్చే విధంగా పోస్టులు పెట్టకూడదని యువతకు హితవు పలికారు. అనంతరం యువకులకు వాలీబాల్ కిట్టును అందజేశారు

2న స్టడీ సెంటర్ సమావేశం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 2న ఎస్‌కెఈ డిగ్రీ కళాశాలలో ఓపెన్ యూనివర్శిటీ స్టడీ సెంటర్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఓపెన్ యూనివర్శిటీలో అడ్మిషన్ తీసుకున్న ప్రథమ, ద్వితయ, తృతీయ సంవత్సరం విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థులు, సెంటర్ టీచింగ్, నాన్ టీచంగ్ సిబ్బంది ఈ సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో పరీక్షలు, స్టడీ మెటీరియల్, సెంటర్ అభివృద్ధి తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

ప్రత్యేక పద్ధతుల్లో

రూపుదిద్దుకున్న ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్

నవతెలంగాణ-జైపూర్



సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఆవరణలో తొలి ప్రయత్నంగా నిర్మించిన ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ప్రత్యేక పద్ధతుల్లో రూపుదిద్దుకుంది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో నిర్మించిన ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మొదటిది. రూ.26 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన ఫ్లోంటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌తో సింగరేణికి ఏడాదికి రూ.3కోట్ల లాభం చేకూరనుందని సంస్థ వెల్లడించింది. సింగరేణి థర్మల్ ప్లాంట్ జలాశయంపై నిర్మించిన 5 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ ద్వారా రోజుకు 27వేల యూనిట్ల చొప్పున ఏడాదికి సుమారుగా 10 మిలియన్ యూనిట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుందని సంస్థ భావిస్తోంది. ఈ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి చేస్తున్న విద్యుత్‌ను 6 ఇన్వర్టర్ల ద్వారా పవర్ గ్రిడ్‌కు అనుసంధానం చేస్తుండగా ఈ విద్యుత్ ఉత్పత్తిని తెలంగాణ రాష్ట్ర ఎన్‌పీడీసీఎల్ సంస్థ వారి జైపూర్ 33.11కేవీ సబ్‌స్టేషన్ ద్వారా గ్రిడ్‌కు సరఫరా చేయనున్నారు. సింగరేణి సంస్థ నిర్మించిన ఈ 5 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్ డిజైన్ దేశీయంగా తొలిసారిగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వారు రూపకల్పన చేయడం విశేషం. మేక్ ఇన్ ఇండియా పథకంలో భాగంగా ఈ ప్లాంట్ వినియోగించిన అన్ని సోలార్ పలకలు దేశంలోనే తయారు చేయడం మరో విశేషం. సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఆవరణలో గల జలాశయం-1లో 22 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. సాధారణంగా నేలపై ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్‌కు ఒక మెగావాట్‌కు 5ఎకరాల స్థలం అవసరమవుతుంది. కానీ సింగరేణి సంస్థ తన ప్లాంట్‌లో ఉన్న జలాశయం నీటి ఉపరితలాన్ని వినియోగించడం ద్వారా అదనంగా భూమిని సమకూర్చుకోవాల్సిన అవసరం లేకుండా నీటిపై తేలియాడే ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను నిర్మించింది. సాధారణంగా జలాశయాల్లో ఉన్న ఎండ వల్ల నీరు కొంత శాతం వరకు ఆవిరి అవుతుంది. అయితే సోలార్ పలకలను నీటిపై పరువడం వల్ల ఆవిరయ్యే నీటిలో సుమారు 70 శాతం నీటి ఆవిరిని తగ్గించుకోవడం జరుగుతుందని సంస్థ వెల్లడించింది. ప్రధానంగా ఈ ప్లాంట్ నిర్మాణంలో తొలి ప్రయత్నంగా ఫ్రేమ్ లెస్ మల్టీ క్రిస్టలైన్ మాడ్యూల్స్‌ను వినియోగించడం విశేషంగా చెప్పుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ రంగ సంస్థ ఎన్టీపీసీ రామగుండంలో ఇటీవల 100 మెగావాట్ల ప్లాంట్‌ను ప్రారంభించినప్పటికీ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో నిర్మించిన తొలి ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ ఇదే అని చెప్పుకోవాలి. తొలి ప్రయత్నంగా 5మెగావాట్ల ఫ్లోంటింగ్ సోలార్ ప్లాంట్‌ను నిర్మించిన సింగరేణి త్వరలోనే మరో 10 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ప్రారంభించడానికి ఏర్పాట్లు పూర్తి చేసుకుంది.



ఏసీడీ పేరుతో విద్యుత్ అదనపు చార్జీలు ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్



ఏసీడీ పేరుతో విద్యుత్ వినియోగదారులపై వేసే అదనపు చార్జీలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కె.రాజన్న అన్నారు. మంగళవారం విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అదనపు చార్జీలతో పేద, మధ్యతరగతి ప్రజలు మరింత కష్టాల్లోకి నెట్టబడుతున్నారన్నారు. సంక్షేమ పథకాలకు చిరునామాగా చెప్పుకుంటున్న కేసీఆర్ ప్రభుత్వం అడ్వాన్స్ పేరుతో వసూళ్లకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత విద్యుత్తును పూర్తిస్థాయిలో అందిస్తున్నామని, కోత అనేది లేకుండా చేశామని, అన్ని స్థాయిలో 24గంటల విద్యుత్ అందిస్తున్నామని ప్రగల్భాలు పలుకుతూ వ్యవసాయ మోటార్లకు కోతలు ప్రారంభించిందని విమర్శించారు. ఇప్పటికే డెవలప్మెంట్ చార్జీల పేరుతో విపరీత అదనపు భారాలను మోపిందని తెలిపారు. అయినా విద్యుత్ సంస్థ నాలుగేళ్లుగా రూ.33వేల కోట్ల బాకీ ఉండటమేంటని ప్రశ్నించారు. వ్యవసాయానికి ఉచితంగా కరెంట్ ఇస్తున్నామని చెప్పే ప్రభుత్వం నేటికీ విద్యుత్ సంస్థకు ఎలాంటి చెల్లింపులు చేయడం లేదన్నారు. ఈ బాకీలను కేసీఆర్ ప్రభుత్వం సర్దాల్సింది పోయి, ప్రజలపై భారాలు వేయడానికి పూనుకుంటోందని మండిపడ్డారు. ఈ విధానాన్ని పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఏసీడీ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి కట్ల లక్ష్మీ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు బక్కన్న, కార్యదర్శి రామలక్ష్మణ్, కోశాధికారి గఫూర్, ఏకేపీఎంఎస్ జిల్లా నాయకులు మహిమూద్, రావుఫ్‌ఖాన్, కిషన్, పోశెట్టి, రాజేందర్, లక్ష్మణ్, భీమవ్వ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం



నవతెలంగాణ-రెబ్బెన

ఉద్యోగ విరమణ పొందిన మహిళా ఉద్యోగి వేముల లక్ష్మి జనరల్ మజ్దూర్‌ను బెల్లంపల్లి ఏరియా జీఎం జి దేవేందర్ మంగళవారం సన్మానించి బ్యాగును అందజేశారు. బెల్లంపల్లి ఏరియాలో జనవరి నెలలో 8 మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందారని తెలిపారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు విశ్రాంతి జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలన్నారు. సింగరేణిలో పనిచేసిన ప్రతి ఉద్యోగికి రావాల్సిన బెన్‌ఫిట్స్‌ను త్వరగా అందించాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగ విరమణ పొందినప్పటికీ వారంతా ఉద్యోగులే, సింగరేణికి ముద్దుబిడ్డలే అన్నారు. కంపెనీ అందించే బెన్‌ఫిట్స్‌ను ఫిక్సు డిపాజిట్ చేసుకొని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీజీకేయస్ ఏరియా ఉపాధ్యక్షుడు మాత్రోత్ శ్రీనివాస్‌రావు, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి జికె కిరణ్‌కుమార్, ఫిట్ కార్యదర్శి గడ్డం రవీందర్, టీబీజీకేయస్ నాయకులు ప్రకాష్‌రావు, జీఎం కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కైరిగూడలో..

కైరిగూడ ఓసీపీలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన గంగిశెట్టి శ్రీనివాస్, పెద్దల పోచం, గోవింద్‌రావును ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్ సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు విశ్రాంత జీవితాన్ని కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలన్నారు. సింగరేణిలో పనిచేసిన ప్రతి ఉద్యోగికి రావాల్సిన బెన్‌ఫిట్స్‌ను త్వరగా అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సింగరేణి కాలరీస్ ప్రచురించిన క్యాలెండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో టీబీజీకేయస్ ఏరియా ఉపాధ్యక్షుడు మాత్రోత్ శ్రీనివాస్‌రావు, మేనేజర్ ప్రవీన్ పాంటింగ్, టీబీజీకేయస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగెం ప్రశాంత్‌రావు, టీబీజీకేయస్ ఫిట్ సెక్రటరీ వెంకటేశ్, సీనియర్ పర్సనల్ అధికారి వేణు, ట్రక్కర్ కమిటీ సభ్యులు ఎం వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌రావు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ప్రతిభ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

గత నెల 27 నుండి 31 వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించిన 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్‌కు చెందిన విద్యార్థిని ఇషికాసింగ్ అద్భుత ప్రతిభ కనబర్చింది. ఈ విద్యార్థిని రూపొందించిన అక్వాపోనిక్ గార్డెన్ జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంపికై జాతీయ స్థాయికి ఎంపికైన విషయం తెల్సిందే. జాతీయ స్థాయిలో కూడా ఆమె రూపొందించిన అక్వాపోనిక్ గార్డెన్ ఆకట్టుకున్నట్లు జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ తెలిపారు. రసాయన రహిత ప్రపంచాన్ని ఎలా తయారుచేయాలో ఆ విద్యార్థిని ప్రాజెక్టు ద్వారా తెలియపర్చినట్లు ఆయన వివరించారు. దీనికి ప్రాజెక్టు మేనేజర్‌గా అలీషా అయూమ్, టీం లీడర్‌గా విశాఖ సింగ్, గైడ్ టీచర్‌గా రాజేశ్వరి వ్యవహరించారు. వీరిని తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ శిల్ప శ్రీనివాస్, టీం సభ్యులు వెంకటేశ్వర్‌రావు, జిల్లా విద్యాశాఖాధికారి అశోక్,



తెలంగాణ టీం సభ్యులు, జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్‌లు అభినందించారు.

మావోయిస్టు కదలికలపై నిరంతర నిఘా

నవతెలంగాణ-జైపూర్

మావోస్టుల కదలికలను ఎప్పటికప్పుడు కట్టడి చేయాలని, పొరుగు రాష్ట్రాల నుండి తెలంగాణలోకి మావోయిస్టులు ప్రవేశించకుండా ముందస్తు నిఘా పటిష్టం చేయాలని పోలీస్ యంత్రాంగం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన పోలీసు అధికారులతో కలిసి మంగళవారం మండల కేంద్రంలో గల సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ అతిథి గృహంలో రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి సమావేశమైనట్లు తెలిసింది. ప్రధానంగా తెలంగాణ సరిహద్దు ప్రాణహిత నది పరివాహక ప్రాంతం మీదుగా మావోయిస్టుల రాకపోకలకు ఎంత మాత్రం అవకాశం ఇవ్వవద్దని పోలీసు అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దు అర్జునగుట్ట వద్ద ప్రాణహిత నదిపై నిర్మించిన వంతెన మీదుగా వచ్చిపోతున్న వాహనాలు, రాకపోకలు కొనసాగిస్తున్న ప్రయాణికును ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నప్పటికీ నిఘా మరింత పటిష్టం చేయాలని తెలంగాణ పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. ఉదయం నుండి సాయంత్రం వరకు సమావేశమైన పోలీసు అధికారులు మీడియాకు మాత్రం సమాచారం ఇవ్వలేదు. సమావేశంలో జరిగిన చర్చలు, తీసుకున్న నిర్ణయాలను వెల్లడించకుండా గోప్యత పాటిస్తున్నారు. సమావేశం మొత్తంగా మావోయిస్టుల కట్టడి గురించి మూడు రాష్ట్రాలకు చెందిన పోలీస్ యంత్రాంగం చర్చించినట్టు తెలుస్తోంది. రామగుండం పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రెమా రాజేశ్వరి వచ్చి రావడంతోనే మూడు రాష్ట్రాల పోలీసులతో సమావేశం ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని మంత్రికి ఆశాల వినతి



నవతెలంగాణ-నిర్మల్

ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని మంగళవారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి తన నివాసంలో ఆశాలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి. సుజాత మాట్లాడారు. ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని కొన్ని సంవత్సరాలుగా తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) అధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. పని భారం పెంచారు కానీ ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆశా కార్యకర్తకు ఫిక్స్‌డ్ వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, కార్మికులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ సీఎం కేసీఆర్ ఆశా వర్కర్స్ కోసం ఆలోచన చేస్తున్నారని, న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం కోసం కృషి చేయాలని ఆశా కార్యకర్తలను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, పలువురు ఆశా వర్కర్లు ఉన్నారు.

ఉచిత కంటి పరీక్షా శిబిరం విజయవంతం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రజా లైఫ్‌కేర్ ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 54 మందిని పరీక్షించగా, ఇందులో 25 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి విడతల వారీగా ఆపరేషన్లు చేయించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. కంటి శుక్లాలు ఉన్నవారు, కంటి చూపు మందగించిన వారు ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ కంటి పరీక్షా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు మనఊరు మనబడి పాఠశాలల ప్రారంభోత్సవాలు

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

మన ఊరు మన బడి, మన బస్తీ మన బడి పథకం కింద ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి కావడంతో ఆ పాఠశాలలను నేడు ప్రారంభోత్సవాలు చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యా శాఖ అధికారిణి ప్రణీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదిలాబాద్ పట్టణంతో పాటు వివిధ మండలంలో ఈ ప్రారంభోత్సవాలు ఉంటాయని తెలిపారు. ఇందులో భాగంగానే ఆదిలాబాద్‌లోని హమీద్‌పుర ప్రభుత్వ ప్రాథమిక (ఉర్దూ) పాఠశాల, విద్యానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఎమ్మెల్యే జోగు రామన్న చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగనుందని తెలిపారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర 2వ మహాసభలను పురస్కరించుకొని సంఘం ఆధ్వర్యంలో గిరిజన విద్యా సంస్థల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో మ్యూజీషియన్ మెస్రం రాజు సైన్స్ ప్రదర్శన విద్యార్థులను ఆలోచింప చేసేలా ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బైరి సోమేశ్, ఉపాధ్యక్షులు ఉయిక విష్ణు, దీపక్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో టీపాల డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తెలంగాణ పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీపాల)-2023 డైరీని కళాశాల ప్రిన్సిపాల్ పి.భరద్వాజ ఆవిష్కరించారు. ఈ డైరీలో పాలిటెక్నిక్ అధ్యాపకులకు ఉపయోగపడే విధంగా వివిధ సర్వీస్ విషయాలను పొందుపరిచారని సంఘ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపాల అధ్యాపక సభ్యులు రాజన్న, నర్సయ్య, క్రాంతి కుమార్, సురేష్, యశశ్రీ, కళాశాల విభాగాల అధిపతులు సిబ్బంది పాల్గొన్నారు.

పట్టపగలే పట్టణంలో చోరీ



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

పట్టణంలోని స్థానిక న్యాయస్థానం ఏరియాలో రిటైర్డ్ తహసీల్దార్ నారాయణ ఇంట్లో మంగళవారం పట్టపగలు దొంగతనం జరిగింది. లక్షెట్టిపేట్ అదనపు ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. తాళం వేసి ఉన్నటువంటి ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారన్నారు. ఇంటి యజమాని అనారోగ్యంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు వెళ్లడంతో పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఆదివారం పట్టపగలే రజక వాడలో దొంగతనం జరుగగా ఒక రోజు వ్యవధిలో మరో దొంగతనం జరుగడంతో ప్రజలు దొంగల భయంతో బేంబేలెత్తిపోతున్నారు.

స్వచ్ఛంద ఉద్యోగ విరమణ



నవతెలంగాణ-తాంసి

ప్రభుత్వ ఉద్యోగిగా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా 24 సంవత్సరాలు ఉద్యోగం చేసి ప్రస్తుతం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు పర్సనల్ పీఏ ఉంటున్న మండల అధ్యక్షురాలు సురికుంటి మంజుల భర్త శ్రీదర్ రెడ్డి మంగళవారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ శ్రేణులు అభిమానులు పాల్గొని, శాలువాతో సన్మానించారు. అయన చేసిన సేవలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భూమయ్య, తహసీల్దార్ శ్రీదేవి ఉన్నారు.

పదవీ విరమణ కార్మికులకు సన్మానం

నవతెలంగాణ- కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై పదవీ విరమణ కార్మికులకు గని అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు మంగళవారం ఘనంగా సన్మానం చేశారు. కాసిపేట గని విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ట్రామర్ కార్మికుడు తుపాకుల నర్సయ్య, ట్రామర్, డీవై సూపరిటెండెంట్ కందుకూరి సోమ నర్సయ్య, ట్రామర్ లవుడ్యా సిందేలకు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ అల్లావుద్దీన్, ఎస్వో సునీల్ కుమార్, ఇంజనీర్లు బాబు, మధూకర్, డిప్యూటీ మేనేజర్ నిఖిల్, అండర్ మేనేజర్లు సుమన్, వంశీ కృష్ణ, సంక్షేమాధికారి మీర్జా గౌస్, టీబీజీకేఎస్ ఏరియా నాయకులు వొడ్నాల రాజన్న, దుగుట శ్రీనివాస్, బైరి శంకర్, అబ్దులుద్దీన్, కనకుల తిరుపతి, లింగస్వామి, లక్ష్మణ్, ఏఐటీయూసీ నాయకులు చిప్ప నర్సయ్య, దాగం మల్లేశ్ పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-నిర్మల్

మైనార్టీల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ శివారు చించోలి(బి) గ్రామ శివారులో కొత్త ఈద్గా నిర్మాణానికి ముస్లిం మత పెద్దలతో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు అతి తక్కువ సమయంలోనే స్థలం మంజూరు చేయించి, ఈద్గాను నిర్మిస్తున్నామని అన్నారు. విశాలమైన స్థలంలో, ప్రశాంత వాతావరణంలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించుకునేందుకు 12 ఎకరాల స్థలంలో మినార్ల ఏర్పాటు, ప్రహరీ గోడ, ప్రధాన ద్వారం, 25 వేల మందికి పైగా సామూహిక ప్రార్థనలు చేసుకునేలా దీనిని నిర్మిస్తున్నామని తెలిపారు. రంజాన్ పండుగ వరకు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మరోవైపు మతాలు, రాజకీయలకు అతీతంగా అన్ని వర్గాల శ్రేయస్సే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, కౌన్సిలర్లు తౌహిద్ ఉద్దీన్ రవుఫ్, సలీం, ముస్లిం మత పెద్దలు మహ్మద్ యూసుఫ్, హబీబ్ జిలానీ, నాయకులు రిజ్వాన్, అబ్దుల్ జావిద్, ఫిర్దోస్ ఖాన్, ముషీర్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆర్టిజన్‌ల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యుత్ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్‌ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని జేఏసీ చైర్మన్ రామచందర్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యుత్ శాఖ ఎస్ఈ వాసుదేవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 జూలై 29 తేదీని ఆర్టిజన్ల విలీన తేదీగా భావిస్తూ పదోన్నతుల్లో అవకాశం కల్పించాలన్నారు. 2018 పీఆర్సి కోల్పోయిన ఆర్టిజన్లకు అంతకుముందు పీఆర్సి వర్తింపచేయాలన్నారు. ఈపీఎఫ్ సీలింగ్ ఎత్తివేయాలన్నారు. కార్మికులందరికీ పరిమితి లేని వైద్య సదుపాయం కల్పించాలని, పనిభారం తగ్గించడానికి ప్రతి సబ్ స్టేషన్‌లో నలుగురు ఆపరేటర్లను ఒక వాచ్‌మెన్‌ను నియమించాలన్నారు. వీటితోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా కన్వీనర్ ఆత్రం మారుతి, కార్యదర్శి ప్రేమ్ సాగర్, మీడియా కార్యదర్శి దేవేందర్, నాయకులు భరత్, చంద్రయ్య, తిరుపతి పాల్గొన్నారు.

కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్



నవతెలంగాణ-నిర్మల్

కంటి వెలుగు వైద్య శిబిరాన్ని జిల్లా కేంద్రంలో పోలీసు కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, జిల్లా ఎస్పీ పి ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. పోలీసు కార్యాలయ సిబ్బంది, నిర్మల్ డివిజన్ ఏఆర్ హెడ్‌క్వాటర్ సిబ్బంది కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసులకు, ఏఆర్, సిబ్బంది అందరికీ కంటి పరీక్షలు నిర్వహించి కండ్లాద్దాలను అందజేశారు. వివిధ విభాగాల్లో ఉన్న అధికారులు సిబ్బంది పనిచేస్తున్నందున ఒకే రోజు అందరికీ పరీక్షలు నిర్వహించడం సాధ్యం కాదని, అందరికీ కంటి పరీక్షలు పూర్తి అయ్యేవరకు ఈ వైద్య శిబిరాన్ని కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ఏఆర్ హెడ్ క్వార్టర్ డ్రైవర్లు, పోలీస్ కార్యాలయ సిబ్బంది, నిర్మల్ డివిజన్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలో భైంసా డివిజన్ పోలీసులకు క్యాంపులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే, భైంసా ఏఎస్పీ కాంతిలాల్, అదనపు ఏఆర్‌ఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ రమేష్, పోలీస్ అధికారులు, సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మన ఊరు-మన బడి పనులు పూర్తి చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు-మనబడి కార్యక్రమం మొదటి విడతలో భాగంగా జిల్లాలో ఎంపికైన పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలని ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం అంకుషాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తెలగూడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల భవనములో చేపట్టిన అభివృద్ధి పనులను డీఈఓ అశోక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి రూ.15 లక్షలతో చేపట్టిన ప్రహరీ గోడ, అదనపు గదులు, మూత్రశాలలు, త్రాగునీరు వసతుల కల్పన పనులు చేపట్టారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

నేడు మన ఊరు మనబడి పాఠశాలల ప్రారంభోత్సవం

నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు, మనబడి కార్యక్రమం కింద జిల్లాలో ఎంపికైన 260 పాఠశాలలలో ఇప్పటివరకు పూర్తయిన 4 మోడల్ పాఠశాలలను బుధవారం నియోజక వర్గాల పరిధిలో ఆయా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిర్మల్ నియోజక వర్గంలో నిర్మల్ రూరల్ మండలం ఎల్లపల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్లోరింగ్, ఫాల్ సీలింగ్, హ్యాండ్ వాష్, సంప్, టైల్స్, డ్యూయల్ డెస్కులు, గ్రీన్ చాక్ బోర్డులు, డిజిటల్ పరికరాలు, కంపౌండ్ వాల్, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్ వంటి మొత్తం 12 రకాల అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. నూతనంగా రంగులు వేసి, అందంగా తీర్చిదిద్ది, ప్రారంభానికి సిద్ధం చేశామని తెలిపారు. అదేవిధంగా ముధోల్ నియోజక వర్గంలో ఎమ్మెల్యే విఠల్ రెడ్డి భైంసాలోని ఎంపీపీఎస్ ఓవైసీ నగర్ పాఠశాలను, కుబీర్ మండలంలోని కస్రా ప్రాథమిక పాఠశాలను ప్రారంభిస్తారని, అలాగే ఖానాపూర్ నియోజకవర్గంలోని ఖానాపూర్ మండలంలోని చింతలపేట ప్రాథమిక పాఠశాలను ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ ప్రారంభిస్తారని తెలిపారు.

బాలేశ్వర ఆలయ నిర్మాణానికి నిధులు కేటాయించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని అన్ని పురాతనమైన ప్రసిద్ధి కలిగిన బాలేశ్వర ఆలయ పున:నిర్మానం కోసం రూ.కోటి నిధులు మంజూరు చేయాలని బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని పెట్టవాగు ఒడ్డున గోండు రాజుల కాలంలో స్వయంభుగ వెలసిన ఆలయం ప్రస్తుతం శిథిలావస్థలో ఉందన్నారు. భక్తుల కొంగుబంగారంగా నిలిచిన ఆలయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆలయానికి సంబంధించిన పున:నిర్మాణం అవసరాన్ని ప్రస్తుత బడ్జెట్ సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులు విడుదల అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, నాయకులు గుండా వెంకన్న, శ్రీనివాస్, నిసార్, గోపాల్ నాయక్, సుంకరి పెంటు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల్లో మరమ్మతు పనులు వేగవంతం చేయాలని విద్యాశాఖ ఈఈ మహవీర్ అన్నారు. మంగళవారం పాఠశాలలోని పనులను అయన పరిశీలించారు. ఈ సంధ్భంగా అయన మన ఊరు మనబడి కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేస్తుందని అన్నారు. నాణ్యతను పాటిస్తూ పనులను వేగవంతం చేసి త్వరలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ శైలేందర్, ఏఈ నర్సింగ్, ప్రధానోపాధ్యాయులు అజ్మీరా ప్రత్యూష పాల్గొన్నారు.